www.kalamjyothi.com

# కలం జ్యోతి

తెలుగు దినపత్రిక

మంగళవారం

22.09.2026

- జూరాలలో రైతుల ఆగ్రహజ్వాల
- ప్రాజెక్టు ముట్టడికి అన్నదాతల యత్నం
- తీవ్ర లాఠీఛార్జ్, నేతల అరెస్టులు
- కాలువల్లో బైఠాయించిన రైతన్నలు
- ఖాకీల బందోబస్తుతో రహదారుల దిగ్బంధం
- చంద్రబాబు తీసుకెళ్తుంటే సర్కారు నిద్ర అంటూ నిలదీత

## మా పంటలకు నీళ్లివ్వరా?

జూరాల ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లున్నా విడుదల చేయకుండా పచ్చని పంటలను ఎండబెడుతున్న సర్కారు మొండివైఖరిపై కర్షక లోకం కన్నెర్రజేసింది. తమ పంటలను కాపాడుకునేందుకు కాలువల్లోకి దిగి ప్రాణాలొడ్డి పోరాడుతున్న అన్నదాతలను, వారికి అండగా నిలిచిన విపక్ష నేతలను ముళ్లకంచెలు, పోలీసు లాఠీలతో అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించడంతో గద్వాల గడ్డపై తీవ్ర ఉద్రిక్తత రాజుకుంది. పక్క రాష్ట్రానికి వందలాది టీఎంసీల జలాలు తరలిపోతుంటే చోద్యం చూస్తూ, సొంత జిల్లా రైతాంగానికి చుక్క నీరివ్వకుండా సంక్షోభంలోకి నెడుతున్న కాంగ్రెస్ సర్కారు వైఖరిపై రైతన్నలు కన్నెర్రజేశారు.

3లో..



## రూ.10 కోసం హత్య

### 'చిల్లర' వివాదంతో మొదలైన ఘర్షణ

- భార్యాపిల్లల ముందే నడిరోడ్డుపై కొట్టి చంపిన వైనం
- రౌడీషీటర్లను అరెస్ట్ చేయాలని ఎమ్మెల్యే డిమాండ్
- వట్టేపల్లిలో ఉద్రిక్తత, పోలీసుల దర్యాప్తు ముమ్మరం

కేవలం పది రూపాయల చిల్లర కోసం మొదలైన చిన్న వివాదం ఒక ఆటో డ్రైవర్ నిండు ప్రాణాన్ని బలిగొంది. భార్యాపిల్లల ముందే నడిరోడ్డుపై రౌడీమూకలు దాడి చేసి హతమార్చిన ఈ కిరాతక ఘటనతో రాజేంద్రనగర్ పరిధిలోని వట్టేపల్లిలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. నెల రోజుల వ్యవధిలోనే ఒకే ప్రాంతంలో వరుస హత్యలు చోటుచేసుకోవడం స్థానికంగా శాంతిభద్రతల వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది.




2లో..



హత్యకు గురైన వ్యక్తి




## సిలబస్ మార్పులపై టీజీపీఎస్సీ స్పష్టత

పోటీ పరీక్షల సిలబస్‌లో మార్పులు చేస్తున్నట్లు వస్తున్న ప్రచారాన్ని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కొట్టిపారేసింది. సిలబస్ సమీక్షకు సంబంధించి ప్రస్తుతం ఎలాంటి కమిటీని ఏర్పాటు చేయలేదని కమిషన్ కార్యదర్శి స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏవైనా భారీ మార్పులు చేయాల్సి వస్తే కనీసం ఏడాది ముందే ప్రకటిస్తామని, స్వల్ప మార్పులు ఉంటే నోటిఫికేషన్‌లోనే వెల్లడిస్తామని పేర్కొంటూ అభ్యర్థులు అసత్య ప్రచారాలను నమ్మి ఆందోళన చెందవద్దని సూచించారు.

కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 21)

## కడెంకు పెరిగిన ఇన్ ఫ్లో

గేట్లు ఎత్తివేసే అవకాశం ఉందని ఈఈ వెల్లడి

4లో..



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 22.09.2026
www.kalamjyothi.com



# రూ.10 కోసం హత్య

## 'చిల్లర' వివాదంతో మొదలైన ఘర్షణ






**కలంజ్యోతి, రాజేంద్రనగర్ (సెప్టెంబర్ 21) :** హైదరాబాద్ రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టేపల్లిలో కేవలం పది రూపాయల చిల్లర వివాదం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. స్థానికంగా నివాసముంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న మహమ్మద్ ముఖ్రమ్ అనే డ్రైవర్‌ను ఆదివారం సాయంత్రం కొందరు వ్యక్తులు నడిరోడ్డుపైనే అత్యంత దారుణంగా కొట్టి చంపారు. కళ్లెదుటే భార్యాపిల్లలు ప్రాధేయ పడుతున్నా కనికరించకుండా గుంపుగా వచ్చి ఈ ఘాతుకానికి ఒడిగట్టడంతో స్థానికంగా తీవ్ర కలకలం, భయాందోళనలు రేగాయి.

**భార్యాపిల్లల ముందే విచక్షణారహిత దాడి**

బాధితుడు ముఖ్రమ్ ఆటో ఛార్జీ రూ.10 కోసం రూ.200 నోటు ఇవ్వగా, మిగిలిన చిల్లర ఇచ్చే క్రమంలో ఇరువర్గాల మధ్య చిన్నగా వివాదం మొదలైంది. ఆ సమయంలో తనను తాను న్యూస్ రిపోర్టర్‌గా చెప్పుకునే అజీమ్ అనే వ్యక్తి ముఖ్రమ్‌ను తీవ్ర పదజాలంతో దూషించాడని స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ ముబీన్ తెలిపారు. అంతటితో ఆగకుండా మరో ఆరు నుంచి ఎనిమిది మంది అనుచరులను అక్కడికి పిలిపించి, నడిరోడ్డుపై భార్యాపిల్లలు చూస్తుండగానే ముఖ్రమ్‌ను కిరాతకంగా కొట్టి హతమార్చారని వివరించారు.

**రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి**

వట్టేపల్లి పరిసర ప్రాంతాల్లో అజీమ్, షోయబ్, వారి అనుచరులు రౌడీషీటర్లుగా చలామణి అవుతూ గూండాగిరీకి పాల్పడుతున్నారని బహదూర్‌పురా ఎమ్మెల్యే ముబీన్ మండిపడ్డారు. ఈ ఒక్క నెల వ్యవధిలోనే ఇదే రోడ్డుపై జరిగిన రెండో హత్య ఇదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ డీసీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ తక్షణమే స్పందించి నిందితులందరినీ అరెస్ట్ చేయాలని, ఈ ప్రాంతంలో పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేసి ప్రజలకు భద్రత కల్పించాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

**పోలీసుల రంగప్రవేశం, దర్యాప్తు ముమ్మరం**

సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు స్థానిక ఏఐఎంఐఎం నాయకులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతుడి భౌతికకాయాన్ని శవపరీక్ష నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని, త్వరలోనే వారిని పట్టుకుంటామని వెల్లడించారు. ఈ హత్యోదంతంతో వట్టేపల్లి ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# ముదిరాజ్ మహాసభను విజయవంతం చేయాలి

### హక్కుల సాధనకే సింహగర్జన అని నాయకుల పిలుపు



**కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 21) :** ఈ నెల 26వ తేదీన సిరిసిల్ల పట్టణంలో నిర్వహించనున్న హలో ముదిరాజ్‌చలో సిరిసిల్ల ముదిరాజ్ సింహగర్జన మహాసభను విజయవంతం చేయాలని ముదిరాజ్ సొసైటీ బాధ్యులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవనంలో సొసైటీ కమ్యూనిటీ ప్రతినిధులు సమావేశమై సభా ఏర్పాట్లపై చర్చించారు. తరతరాలుగా ముదిరాజులు ఎదుర్కొంటున్న సామాజిక వెనుకబాటుతనాన్ని పారద్రోలడం, న్యాయమైన హక్కుల సాధన కోసమే ఈ మహాసభను ఏర్పాటు చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. రాబోయే కాలంలో ముదిరాజులకు రాజకీయంగా, ఉద్యోగపరంగా సముచిత అవకాశాలు కల్పించాలని కోరారు. తమ సామాజిక వర్గాన్ని బీసీడీ నుంచి బీసీఏ కేటగిరీలోకి మార్పు చేస్తూ రిజర్వేషన్లు వర్తింపజేయాలని, 50 ఏళ్లు నిండిన ప్రతి ముదిరాజ్ కులస్తుడికి పింఛన్ మంజూరు చేసేలా ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న సిరిసిల్లలో జరిగే సింహగర్జన సభకు ముదిరాజులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ ఇల్లంతకుంట ఫిషరీస్ సొసైటీ అధ్యక్షులు కూనబోయిన బాలరాజు ముదిరాజ్, ఉపాధ్యక్షులు రఘు ముదిరాజ్, ముదిరాజ్ సంఘం1 అధ్యక్షులు కూనబోయిన దేవయ్య ముదిరాజ్, సొసైటీ ట్రెజరర్ రెగుల కార్తీక్ ముదిరాజ్, ఎంద్రా భూచ్చయ్య, ప్రతినిధులు కూనబోయిన కనుకయ్య ముదిరాజ్, కునబోయిన రాజు, కూనబోయిన సుధాకర్, కునబోయిన కనుకయ్య, కూనబోయిన బాలరాజు, రేగుల అనీల్, కునబోయిన బాలరాజు, కునబోయిన కార్తీక్, కునబోయిన పరశురాం, కునబోయిన రాజు, ఎంద్ర రవి, ఎంద్ర నరేష్, కునబోయిన రాజు, కూనబోయిన శేఖర్, కునబోయిన కనుకరాజు, గంగు రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతలను సద్వినియోగం చేసుకోవాలి

**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 21) :** పాత మగ్దూంపురం గ్రామంలో వీబీజీ రామ్ జీ (ఈజీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను (రెయిన్ హార్వెస్టింగ్ గుంతలు) ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ ననుమస కర్ణాకర్ సూచించారు.



వర్షపు నీటిని వృథా చేయకుండా భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారానే భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ నివాసాల పరిసరాల్లోని ఇంకుడు గుంతలను పరిశుభ్రంగా ఉంచి, వర్షపు నీరు వాటిలోకి చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో నీటి ఎద్దడి రాకుండా నివారించేందుకు వర్షపు నీటి సంరక్షణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు తమ ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థ మురుగు నీరు రోడ్లపైకి రాకుండా ఇంకుడు గుంతల ద్వారా ఇంకేలా చూడాలన్నారు. ఈ పథకంలో భాగంగా ఇంకుడు గుంత నిర్మాణానికి రూ. 6,500, రెయిన్ హార్వెస్టింగ్ ఇంకుడు గుంతకు రూ. 13,000 ప్రభుత్వం నుంచి అందుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అలువాలా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ కుమారి, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్లపై ఫిర్యాదు

### క్షేత్రస్థాయి విచారణకు ఎంపీడీవో ఆదేశం

**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 21) :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల సమస్యలపై బోడ మాణిక్యం తండా గ్రామ సర్పంచ్ భూక్య ఉమా మోహన్ నాయక్ అధికారులకు ఫిర్యాదు చేశారు. తండాలోని నిరుపేద కుటుంబాలకు చెందిన చించావత్ విజయ రామ్ దాన్, భూక్య విజయ వీరేందర్ ఇళ్ల విషయమై గతంలో అధికారులు చేసిన పొరపాట్లను ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు.

గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి, ఇతర సిబ్బంది కిరాయి ఇంట్లో నివసిస్తున్న వీరి ఇళ్ల వద్ద ఫోటోలు తీసి స్లాబులుగా చూపిస్తూ తప్పుడు వివరాలు నమోదు చేయడం వల్ల సుమారు 10 మంది పేర్లు ఎల్ 3 కేటగిరీలో పడ్డాయని ఆరోపించారు. దీనిపై గతంలో జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దాంతో బాధితుల ప్రస్తుత నివాసాల వాస్తవ ఫోటోలను జతచేసి ఎంపీడీవోకు అర్జీ అందించారు. దీనిపై తక్షణమే స్పందించిన మండల అభివృద్ధి అధికారి, హౌసింగ్ ఏఈ భవ్యను పిలిపించి మాట్లాడారు. ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి ద్వారా క్షేత్రస్థాయి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమస్యపై వెంటనే స్పందించినందుకు ఎంపీడీవోకు సర్పంచ్, బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.





# సాదులనగర్‌లో ఘనంగా గణేష్ నిమజ్జనం

### ఆటపాటలు, కోలాటాలతో ఊరేగింపు నిర్వహణ

**కలంజ్యోతి, హత్నూర (సెప్టెంబర్ 21) :** హత్నూర మండల పరిధిలోని సాదులనగర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో కొలువుదీరిన విఘ్నేశ్వరుడి నిమజ్జనోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. నవరాత్రుల పూజలు అందుకున్న గణపతిని ఆటపాటలు, కోలాటాలు, భజన కీర్తనల నడుమ పురవీధుల్లో శోభాయాత్రగా నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ యువసేన ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామంలో ప్రతి ఏటా వినాయకుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గణనాథుడి కృపతో గ్రామ ప్రజలు, పిల్లపాపలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు. భక్తుల నినాదాలతో శోభాయాత్ర కోలాహలంగా సాగింది. ఈ కార్యక్రమంలో యువసేన ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక
3
మంగళవారం 22.09.2026
www.kalamjyothi.com

# మా పంటలకు నీళ్లివ్వరా?

**కలంజ్యోతి, గద్వాల (సెప్టెంబర్ 21) :** సాగునీటి విడుదలపై సర్కారు అవలంబిస్తున్న తీరుతో జూరాల ప్రాజెక్టు పరిధిలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రిజర్వాయర్‌లో పుష్కలంగా నీటి నిల్వలు ఉన్నప్పటికీ పంటలను నిలువునా ఎండబెడుతున్నారంటూ అన్నదాతలు పెద్ద ఎత్తున తిరుగుబాటుకు దిగారు. రైతులకు మద్దతుగా కదిలిన విపక్ష శ్రేణులు డ్యాం వైపు దూసుకెళ్లే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తత పరాకాష్టకు చేరింది. ముందస్తుగా విధించిన గడువు ముగిసినా అధికారులు కాలువలకు సాగునీరు వదలకుండా నిర్లక్ష్యం వహించడంతో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. గద్వాల, అమరచింత ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కర్షకులు డ్యాం ముట్టడికి ఉపక్రమించారు. పోలీసులు ప్రధాన రహదారులపై వాహనాలు నిలిపి అడ్డుగోడలు సృష్టించినా, రైతులు పొలాల గుండా కిలోమీటర్ల దూరం కాలినడకన ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు.

**కాలువల్లో బైఠాయించిన అన్నదాతలు..**

శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులపై ఖాకీలు బలప్రయోగం చేశారు.



మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డిలను ఇళ్లలోనే బంధించగా, ఘటనా స్థలానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో పోలీసులు రైతులపై విచక్షణారహితంగా విరుచుకుపడ్డారు. కార్యకర్తలు వాహనాలకు అడ్డంగా పడుకుని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసుల హెచ్చరికలను ఏమాత్రం ఖాతరు చేయని రైతులు ప్రాణాలకు తెగించి నేరుగా సమాంతర కాలువల్లోకి దిగారు. నీరు లేక బీటలు వారుతున్న కాలువల్లోనే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. చేతికొచ్చిన పైరు ఎండిపోతుంటే ప్రాణాలు కోల్పోవడం తప్ప మరో మార్గం లేదని రైతులు కంటతడి పెట్టారు.

**చంద్రబాబు తీసుకెళ్తుంటే సర్కారు నిద్ర..**

వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏపీ ప్రాంతాలకు కృష్ణా జలాలు నిరాటంకంగా తరలిపోతుంటే, ఇక్కడి పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతు సంఘాలు ధ్వజమెత్తాయి. సొంత జిల్లాలోనే ప్రాజెక్టు ఉన్నా రైతులకు నీళ్లివ్వలేని దౌర్భాగ్య పరిస్థితి దాపురించిందని విమర్శించారు. తక్షణమే కాలువలకు సాగునీరు విడుదల చేయకపోతే కలెక్టరేట్ ముట్టడితో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# జీపీవోపై అరెస్ట్ వారెంట్

**విచారణకు హాజరుకాకపోవడంతో జారీ చేసిన న్యాయస్థానం**



**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 21) :** నర్సంపేట రెవెన్యూ కార్యాలయంలో మాదన్నపేట జీపీవోగా విధులు నిర్వర్తిస్తున్న చెన్నారావుపేట గ్రామానికి చెందిన చెలుకలపెల్లి నరసింహస్వామిపై నర్సంపేట అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. గతంలో నమోదైన ఐపీసీ 447, 427 కేసుల (కేసు నెం. 348/2022 / క్రైమ్ నెం. 63/2021) విచారణకు వరుసగా న్యాయస్థానానికి హాజరుకాకపోవడాన్ని న్యాయమూర్తి తీవ్రంగా పరిగణించారు. ఈ క్రమంలో నిందితుడైన నరసింహస్వామిపై సీఆర్‌పీసీ సెక్షన్ 70 కింద నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ, తక్షణమే అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచాలని చెన్నారావుపేట స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను ఆదేశించారు. కోర్టు ఆదేశాల మేరకు సోమవారం చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి తన సిబ్బందితో కలిసి నిందితుడు నరసింహస్వామిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిబంధనల ప్రకారం కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వ ఉద్యోగంలో కొనసాగుతూ కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేయడంపై స్థానికంగా తీవ్ర చర్చ జరుగుతోంది.

బాధిత వ్యక్తి రాజు మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ నరసింహస్వామి తన భూములపై, కుటుంబంపై పలుమార్లు దాడులకు తెగబడ్డాడని ఆరోపించారు. చేతికందే దశలో ఉన్న తన పంటకు ఉద్దేశపూర్వకంగా గడ్డి మందు పిచికారీ చేసి తీవ్ర నష్టం కలిగించాడని ఆవేదన చెందారు. ఆయన పెట్టిన వేధింపులు తాళలేక గతంలో తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రి పాలయ్యానని తెలిపారు. న్యాయస్థానం స్పందించి నిందితుడిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని, సర్వీసు నుంచి శాశ్వతంగా తొలగించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

# నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుదాం

**బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి**



**కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 21) :** వినాయక నవరాత్రుల్లో భాగంగా జరిగే నిమజ్జన వేడుకలను అత్యంత శాంతియుతంగా నిర్వహించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోరారు. నిమజ్జన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా సాగేలా అధికారులు అన్ని విధాలా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జనానికి తరలివచ్చే అశేష భక్తులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలన్నీ పూర్తి సమన్వయంతో విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేసినప్పుడే వేడుకలు విజయవంతమవుతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక కౌన్సిలర్లు, పట్టణ బీజేపీ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# నేడు భైంసాలో వినాయక నిమజ్జనం

**పట్టణంలో భారీగా పోలీసు భద్రతా బలగాల మోహరింపు**

**కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 21) :** నిర్మల్ జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతమైన భైంసా పట్టణంలో మంగళవారం జరగనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పెద్ద సంఖ్యలో భద్రతా బలగాలను మోహరించారు. నిమజ్జనం నిర్వహించనున్న గడ్డెన్న వాగు ప్రదేశాన్ని ఎస్పీ పరిశీలించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో జరిగేలా ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, రూట్ నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. నిమజ్జనం విజయవంతం కావడానికి ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, సీఐలు ప్రవీణ్, సాయి కుమార్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు సాగునీరు అందించాలి

**శాసనసభలో కాదు.. ప్రత్యక్ష పోరాటాల్లో పాల్గొనాలి**



**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ (సెప్టెంబర్ 21) :** పాలకుల తీవ్ర నిర్లక్ష్యం వల్ల పంట పొలాలకు సాగునీరు అందక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందని బీఆర్ఎస్ యువ నేత నాగం శశిధర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఆందోళనలు చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని, స్థానిక ఎమ్మెల్యే కేవలం అసెంబ్లీలో మాట్లాడడం కాకుండా రైతులు చేసే పోరాటాల్లో స్వయంగా పాల్గొని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

తమ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యం కారణంగా రాష్ట్రంలో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో కృష్ణానది 300 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్నప్పటికీ సాగునీటి తిప్పలు తప్పడం లేదన్నారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రజా వ్యతిరేక పాలనకు ప్రజలే చరమగీతం పాడుతారని హెచ్చరించారు.

సరైన ప్రణాళికలు లేకపోవడం వల్ల శ్రీశైలం నుంచి ఆంధ్ర ప్రాంత నాయకులు పూర్తి నీటి హక్కులను వినియోగించుకోవడమే కాకుండా, అనధికారికంగా వందల టీఎంసీల నీటిని తరలించుకుపోతున్నారని, ఇక్కడి పాలకులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి తన సొంత జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ వహించి, బడ్జెట్‌లో అత్యధిక నిధులు కేటాయించి జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు అర్థం రవి, బాలా గౌడ్, అర్జున్యా, భీముడు, సత్యం, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ నిధులు



**కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 21) :** చెన్నారావుపేట మండలం ఝల్లి గ్రామానికి చెందిన కేతిడి గౌతమి, రాజేందర్ రెడ్డి దంపతులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 94,000 చెక్కు మంజూరైంది. మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును ఝల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాధావత్ బాలు నాయక్ లబ్ధిదారులకు అందజేశారు. పేద ప్రజల కష్టాలను గుర్తించి తక్షణమే స్పందించి ఆర్థిక భరోసా కల్పించినందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, ఇందుకు కృషి చేసిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి లబ్ధిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిట్ల శ్రీనివాస్, అంబాల శ్రీను, రజినీకార్ రెడ్డి, ఇండ్ల సునీల్, జెరుపుల ప్రవీణ్, గంధం లెనిన్, కేతిడి వెంకట్ రెడ్డి, కేతిడి రాంరెడ్డి, మెండే విజేందర్, భూక్యా సంతోష్, కొర్ర శివ, జెరుపుల కిషన్, జెరుపుల శ్రీను, శ్రీపాల్, సింహాద్రి, రాజు తదితరులు పాల్గొన్నారు.



# కడెంకు పెరిగిన ఇన్ ఫ్లో

**కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 21) :** నిర్మల్ జిల్లాలోని కడెం నారాయణ రెడ్డి ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 700 అడుగులు కాగా, ప్రస్తుతానికి గరిష్ట స్థాయికి చేరుకుంది. ఎగువ నుండి 861 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండటంతో వరద తీవ్రత మరింత పుంజుకుంటోంది. ఈ నేపథ్యంలో అధికారులు పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరద కారణంగా కడెం ప్రాజెక్టు గేట్లను సోమవారం రాత్రి వేళల్లో ఎప్పుడైనా ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసే అవకాశముందని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, నదీ పరీవాహక దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది వైపు పశువులు, గొర్రెలను మేపేందుకు వెళ్లకూడదని సూచించారు.

# దౌల్తాబాద్‌లో అన్నదాన కార్యక్రమం

## బాల గణేష్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహణ



**కలంజ్యోతి, నర్సాపూర్ (సెప్టెంబర్ 21) :** హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ గ్రామం నాల్గవ వార్డులో బాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం వినాయక నవరాత్రుల సందర్భంగా ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ, విఘ్నేశ్వరుని అనుగ్రహంతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి ఏటా సేవాభావంతో బాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో సభ్యులంతా ఏకతాటిపైకి వచ్చి విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అన్నదానం చేపట్టడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన దాతలందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసజి శ్రీనివాస్, శెట్టిపల్లి వెంకటేష్ గౌడ్, సతీష్, దేవేందర్, వెంకటేష్, కటికే దేవేందర్, మ్యాదరి ఆంజనేయులు, వనరి గారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# ఏపీలో ఎన్డీఏను మరింత పటిష్టం చేస్తాం

## విశ్వహిందూ మహాసంఘ్ నేతలతో మద్దిశెట్టి సామేలు భేటీ

**కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం (సెప్టెంబర్ 21) :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. పెద్ద తిరుపతిలోని ప్రైవేట్ గెస్ట్ హౌస్‌లో ఎన్సీపీ, ఎన్డీఏ మహాకూటమి జాతీయ కార్యవర్గ సభ్యులు, ఏపీ రాష్ట్ర ఇన్చార్జ్ మద్దిశెట్టి సామేలు పర్యటించి పలువురు ప్రముఖులతో సమావేశమయ్యారు. విశ్వ హిందూ మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షులు బి. చిన్నదొరస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.

అనంతరం ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త నాగవేటి సుబ్రహ్మణ్యం ఆచారితో దాదాపు గంటపాటు సమావేశమై మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడం, యువతను భాగస్వామ్యం చేయడంపై చర్చించారు. అనంతరం మద్దిశెట్టి సామేలు మాట్లాడుతూ, పెద్దల ఆశీస్సులు తీసుకోవడం తమ సంప్రదాయమని, చిన్నదొరస్వామి సుదీర్ఘ అనుభవం, ఆచారి మార్గదర్శకత్వం ఎంతో అవసరమని పేర్కొన్నారు. జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి సంక్షేమ ఫలాలను ప్రతి గడపకూ తీసుకెళ్తామని, ప్రధాని మోదీ నాయకత్వంలో సమగ్ర అభివృద్ధిని సాధిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్సీపీ ఎన్వైసీ తమిళనాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింద రవిరాజ్, బి. జమీన్ ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణాదిలో ఎన్డీఏను బలోపేతం చేస్తాం

## కోలా ఆనంద్‌తో మర్యాద పూర్వకంగా భేటీ అయిన మద్దిశెట్టి సామేలు

**కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం (సెప్టెంబర్ 21) :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ ఏపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జ్ కోలా ఆనంద్‌తో ఎన్సీపీ, ఎన్డీఏ మహాకూటమి జాతీయ కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర ఎన్వైసీ అధ్యక్షులు, ఏపీ, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల ఇన్చార్జ్ మద్దిశెట్టి సామేలు సోమవారం శ్రీకాళహస్తిలోని గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దాదాపు గంటపాటు సాగిన ఈ సమావేశంలో పలు కీలక రాజకీయ అంశాలపై సమాలోచనలు జరిపారు. ఏపీలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలో ఎన్సీపీ కీలక భాగస్వామిగా కొనసాగుతున్న నేపథ్యంలో, కూటమిని మరింత బలోపేతం చేయడంపై చర్చించారు. గ్రామ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని విస్తరించడం, యువతను పెద్ద ఎత్తున పార్టీ వైపు ఆకర్షించడం వంటి అంశాలపై నేతలు చర్చలు జరిపారు. అనంతరం మద్దిశెట్టి సామేలు మాట్లాడుతూ, జాతీయ ఎన్వైసీ అధ్యక్షులు ధీరజ్ శర్మ దిశానిర్దేశం మేరకు దక్షిణాది రాష్ట్రాల్లో ఎన్డీఏ కూటమిని ఉక్కు సంకల్పంతో బలోపేతం చేస్తామని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో యువతకు భరోసా కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పలగాని శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ‘ఆల్మోస్ట్ నల్లవన్’ షూటింగ్ అప్‌డేట్

కోలీవుడ్ నటి దుషారా విజయన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘ఆల్మోస్ట్ నల్లవన్’ రెండో షెడ్యూల్ షూటింగ్ తెన్కాశి పరిసర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది. ప్రముఖ దర్శకుడు హెచ్. వినోద్ నిర్మాతగా, నటుడు రాజు జయమోహన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో సీనియర్ నటుడు సత్యరాజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. మొదటి షెడ్యూల్ విజయవంతంగా పూర్తి కావడంతో, ప్రస్తుతం జరుగుతున్న తాజా షెడ్యూల్‌కు సంబంధించిన ఫొటోలను దుషారా విజయన్ సోషల్ మీడియాలో పంచుకోవడంతో అవి వైరల్ అవుతున్నాయి.



కలం జ్యోతి
తెలుగు దినపత్రిక